www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 15 నవంబర్ 2022



ఎరువుల పంపిణీకి వాలంటీర్ల నియామకం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రైతులకు ఎరువులు పంపిణీ చేసేందుకు సంబంధిత గ్రామ పంచాయతీల నుంచి ప్రతి ఆర్‌బికె కేంద్రానికి ఒక్కో వాలంటీర్‌ను నియమించినట్లు వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాలలోని 12 ఆర్‌బికె కేంద్రాలలో కలెక్టర్ గిరీష ఆదేశాల మేరకు వాలంటీర్లను నియమించినట్లు చెప్పారు. వీరు ఆర్‌బికె కేంద్రాలలో రైతులకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన ఎరువులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. రైతుల వద్ద నుంచి అవసరమైన ఎరువుల ఇండెంట్ సేకరించి, ఎరువులు ఆర్‌బికె కేంద్రాలకు వచ్చేలా పనిచేస్తారన్నారు. ఎప్పటికప్పుడు ఎరువులు విక్రయించిన నిధులను ప్రభుత్వానికి జమ చేస్తారని వివరించారు. రైతులు ఆర్‌బికె కేంద్రాలలోని వాలంటీర్లను సంప్రదించి తమకు అవసరమైన ఎరువులను తెప్పించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలనీ, రాయితీ ధరలలో ఎరువులు పొందాలని వ్యవసాయాధికారి కోరారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : 'సిటు'



జెసి తమీమ్ అన్సారీయాకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

30 ఏళ్లుగా పనిచేస్తున్న ఆరుగురు పంచాయతీ కార్మికులను అకారణంగా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమని, తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవాని ఎపి గ్రామ పంచాయతీ కార్మికులు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో జెసి తమీమ్ అన్సారీయాకు ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేసిన పనికి పెండింగ్ వేతనాలు అడిగినా, జీతం పెంచమన్నా నిర్దాక్షిణ్యంగా కార్మికులను విధుల్లోని తొలగింస్తున్నారని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులపై కచ్చ కట్టడం పిచుకపై బ్రహ్మాస్త్రం అన్నారు. 2015 గౌరవ హైకోర్టు నిబంధనలు పాటించకుండా విధులు ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎపి గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సురేంద్ర బాబు మాట్లాడుతూ కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. పదిరోజుల్లోపు తొలగించిన గ్రామ పంచాయతీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని లేని పక్షంలో రాయలసీమ వ్యాప్తంగా విధులు, బహిష్కరిస్తామని, డిపిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, రెడ్డెయ్య, ప్రమీల, శ్యామల, వీరప్ప అంజనమ్మ, నటరాజు, రమేష్, రామాంజులు పాల్గొన్నారు.

అర్జీలను పారదర్శకంగా పరిష్కరించాలి : కలెక్టర్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

అధికారులు ప్రజలకు నమ్మకం కలిగేలా స్పందన అర్జీలను పారదర్శకంగా పరిష్కరించాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్‌ఒ సత్యనారాయణ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తుంటారన్నారు. అధికారులు బాధితుల సమస్యలు గుర్తించి శాశ్వత పరిష్కారం ఇవ్వాలన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులకు అర్థమయ్యే విధంగా తప్పులు లేకుండా పరిష్కార నివేదిక పంపాలన్నారు. ప్రతి అర్జీ మొక్కుబడి రీతిలోగాక అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. దరఖాస్తు బియాండ్ ఎస్ ఎల్‌ఏలోకి వెళ్లకుండా సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలు శనివారం లోపల పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. రాబోయే రెండు, మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తహశీల్దార్లందరూ తమ హెడ్ క్వార్టర్‌లో ఉండాలన్నారు. భారీ వర్షాలకు ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకున్నా వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల హెచ్‌ఒడిలు వారానికి రెండు రోజులు సచివాలయాలు, మండల కార్యాలయాలు సందర్శించాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు 220 వినతి పత్రాలు సమర్పించారని, ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆయాశాఖాధికారులకు సూచించారు.

'గరికపాటి' బహిరంగ క్షమాపణ చెప్పాలి : ఐద్వా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళలను కించపరుస్తూ మాట్లాడిన గరికపాటి నరసింహారావు వెంటనే మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నాయకులు ఎం.భాగ్యమ్మ, చిట్వేలి మండల కన్వీనర్ యదురూరి సుజాతలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజంలో లక్షలాది మంది ప్రజానీకం అభిమానం సంపాదించుకున్న గరికపాటి నరసింహారావు ఇటీవల కాలంలో పదేపదే ఆడవాళ్ళ అవయవాలను, ఆధునిక దుస్తులను అసభ్యకరంగా వర్ణిస్తూ చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్రంగా ఖండిస్తూ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన తక్షణం తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, మహిళా కమిషన్ జోక్యం చేసుకొని విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలతో మనుధర్మ శాస్త్రం కనిపిస్తుందని, మహిళల అభివృద్ధికి ఆటంకం కలిగించే విధంగా ఉందని తెలిపారు. ఆడవాళ్ళ అంగాంగా వర్ణనను చేతులతో చూపిస్తూ మాట్లాడడం దుర్మార్గమని ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతిని ఆమె యొక్క శరీరాన్ని ఏనుగుతో పోలుస్తూ మహిళ అని చూడకుండా అవహేళన చేయడం నేరమన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

స్పందన ఫిర్యాదులపై సత్వరం స్పందించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో భాగంగా 33 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులకు అత్యధికంగా ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులపై అధికారులు దృష్టిసారించి వాటిని వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఒక ఫిర్యాదు కూడా పెండింగ్ లేకుండా నిర్ణీత వ్యవధిలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భార్యాభర్తల కేసులో స్పందించి కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దేలా వ్యవహరించాలని సూచించారు. చెడు వ్యసనాలు, వివాహేతర సంబంధాలు, అధిక కట్నం కోసం భార్యను వేధిస్తున్న కేసులో స్పందించి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దేలా వ్యవహరించాలని సూచించారు. చట్ట పరిధిలోని సమస్యలను పరిష్కరించడానికి పోలీస్ శాఖ ఎల్లవేళలా కృషి చేస్తుందని ప్రజలు తమ సమస్యలను నేరుగా వచ్చి ఫిర్యాదు చేయని పరిస్థితుల్లో డయల్ 100 కు సమాచారం చేరవేస్తే పోలీస్ శాఖ వెంటనే పరిష్కరిస్తుందని ఆయన తెలిపారు.



అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

పటిష్టంగా ధాన్యం సేకరించాలి

వ్యవసాయ శాఖ స్పెషల్ సిఎస్ పూనం మాలకొండయ్య

రాయచోటి : తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చిందనే మాట ఎక్కడా రాకూడదని, అత్యంత పటిష్ట విధానంతో ధాన్యం సేకరణ కొనసాగాలని వ్యవసాయ శాఖ స్పెషల్ సిఎస్ పూనం మాలకొండయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడ నుంచి వరి ధాన్యం సేకరణ 2022-23 పై వ్యవసాయశాఖ కమిషనర్ సి.హెచ్.హరికిరణ్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ విసి అండ్ ఎండీ జి. వీరపాండియాన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్‌లు, జేసిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ విసి హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, జాయింట్ కలెక్టర్ తమిమ్ అన్సారీయా, డిఎస్‌ఒ, సివిల్ సప్లయిస్ డిఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ స్పెషల్ సిఎస్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వరి పంట కోత దశకు వచ్చిందని, వర్షాకాలం నేపథ్యంలో రైతులకు అవరసమైన పరికరాలు, గోతాలను సిద్ధంగా ఉంచుకొనేల చర్యలు తీసుకోవాలన్నారు. రోజూ ఏ ఊరి నుంచి ఎంత ధాన్యం వస్తుందనే సమాచారాన్ని అంచనా వేయాలని తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువకు ఎట్టి పరిస్థితులలోనూ కొనుగోలు చేయరాదన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు : డిపిఎంఒ

కలికిరి: ఇంటివద్దకే వైద్యుల సేవలు 104తో సాధ్యమని జిల్లా డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. సోమవారం సోమవారం మండలంలోని మెడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన కలికిరి 4వ సచివాలయం, రెడ్డివారిపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ క్యాంప్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యాదికారులు నేరుగా గ్రామానికి వచ్చి బిపి, షుగర్ పరీక్షలు చేసి మందులు ఇవ్వాలన్నారు. గర్భిణులకు సలహాలు, జాగ్రత్తలు వివరించి మందులను ఉచితంగా పంపిణీ చేస్తారని తెలియజేశారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులు వస్తాయని ఈ వ్యాధి లక్షణాలు తెలిసిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని తెలియజేశారు. 68 మందికి వివిధ రకాల జబ్బులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో104 వైద్యులు డాక్టర్ అహమ్మద్, మెడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చిన్న రెడ్డెప్ప, ఎఎన్‌ఎం ఉషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ:** గ్రామీణ ప్రాంత ప్రజలకు 104 సేవలు దేవుడిచ్చిన వరం లాంటిదని వైద్యాధికారి మోహన్ తెలిపారు. మండలంలోని కోన సచివాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ గ్రామంలో ఉన్న ప్రజలకు వైద్యశాలలకు వెళ్లి వైద్యం చేయించుకోలేని వారికి వారి ఇంటి వద్దకే వైస్ సిబ్బంది వచ్చి వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావించవచ్చని తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మధుమేహంపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఇ కొండయ్య



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

సర్వే పక్కాగా ఉండాలి

రామాపురం : కుష్టు వ్యాధి నిర్మూలనకు ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని మండల వైద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేపై ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో ఇంటింటి సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. సర్వే కోసం ప్రజా ప్రతినిధులు, ప్రజలు, ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు కార్యక్రమంలో డిపిఎంఒ కృష్ణారెడ్డి, సిహెచ్‌ఒ ఎలైజర్, పిహెచ్‌ఎన్ విజయకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు రాఘవేంద్ర రాజు, ఉమామహేశ్వరి, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'సన్ రైజ్' గుర్తింపు రద్దు చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని సన్ రైజ్ ఇంటర్నేషనల్ స్కూల్ అనుమతి ఒకచోట ఉంటే స్కూల్ మాత్రం ఇంకొక చోట నడుపుతున్నారని వెంటనే పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడయాతో మాట్లాడుతూ తప్పుదోవ పట్టించిన స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రధానంగా సన్ రైజ్ ఇంటర్నేషనల్ స్కూలు ఎన్జీవో కాలనీలో అనుమతులు తీసుకున్నారని, జగదాంబ సెంటర్‌లో ఉన్న ఎస్‌వి విద్యామందిర్‌పైన హైస్కూల్ నడుపుతున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. పట్టణంలో అనేక విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు వ్యతిరేకంగా నడుస్తున్నాయని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారికి పలుదాపాలుగా విన్నవించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా విఫలం అయిందని తక్షణమే కలెక్టర్ స్పందించి స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని అన్నారు. లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, ఉపాధ్యక్షులు రమణ పాల్గొన్నారు.

సంప్రదాయ ఆహార నియమాలే మధుమేహానికి రక్షణ

ప్రజాశక్తి-పీలేరు


సంప్రదాయ ఆహార నియమాలే మధుమేహానికి రక్షణ అని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య అన్నారు. మధుమేహ వ్యాధి గురించి తెలుసుకుని జీవిత కాలం పెంచుకుందామని పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా తలుపుల, గూడరేవుపల్లి సచివాలయాల్లో మధు మేహంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలో గుర్తించడం కష్టమని, ఒక్కోసారి కొందరిలో వ్యాధి లక్షణాలు కనిపించకనే శరీరం కొన్ని జబ్బులకు లోనవుతుందన్నారు. అధిక దాహం, అధిక మూత్రం, నీరసం, అధిక ఆకలి, బరువు తగ్గడం, పుండ్లు మానక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే షుగర్ వ్యాధిగా అనుమానించి తక్షణం వ్యాధి నిర్ధారణ కోసం వైద్యులను సంప్రదించాలని చెప్పారు. రక్తంలో చక్కర శాతం మోతాదుకు మించి ఉండడాన్ని మధుమేహం వ్యాధి అంటామని తెలిపారు. తీపి పదార్థాలకు స్వస్తి పలికి, శారీరక శ్రమతో పాటు, బరువును అదుపులో ఉంచుకుంటూ మధుమేహాన్ని నియంత్రించి జీవితకాలం పెంచుకుందామన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ వెంకటసుబ్బమ్మ, పర్యవేక్షకులు కృష్ణయ్య, కార్యదర్శులు, సిహెచ్‌ఒ లావణ్య, నాగవేణి, ఆశ కార్యకర్తలు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మహతి ఫార్మసీ కళాశాలలో మధుమేహంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మధుమేహం రావడానికి గల కారణాలు, వచ్చిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఫ్యాకల్టీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలను చైర్మన్ అమరనాథరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ప్రకాష్‌రెడ్డి అభినందించారు. **వాల్మీకిపురం:** ప్రతి ఒక్కరూ వారి వారి జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం వలన డయాబెటిస్‌ను నియంత్రించవచ్చునని చింతపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి మానస అన్నారు. చింతపర్తి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షుగర్ అనేది హార్మోన్స్ అసమతుల్యత వలన వచ్చే రుగ్మత అని, షుగర్ వ్యాధి గ్రస్థులకు ఇన్సులిన్ హార్మోన్ ఇంజెక్షన్ రూపంలో లభిస్తున్నందున వారు బ్రతకగలుగుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రోజు వ్యాయామం, యోగా చేయడం, ఒత్తిడి, ఆలోచనలను తగ్గించుకోవడం, మాంసాహారంకు బదులుగా శాఖాహారం ఎక్కువగా తీసుకోవడం, ప్రతి ఆరు నెలలకు ఒకసారి మాస్టర్ హెల్త్ చెకప్ చేసుకోవడం, జామ, దానిమ్మ, అరటి, ద్రాక్ష, కీరదోస, అల్లనేరేడు, ఆపిల్ వంటివి ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫి, సిహెచ్‌వో ఇందిరా రాణి, సూపర్‌వైజర్ పూర్ణమ్మ, ఎంఎల్‌హెచ్‌పి రెడ్డెమ్మ, ఎఎన్‌ఎం అరుణ, ఆశాకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై దృష్టి సారించండి

- అడిషనల్ ఎస్‌పి వివి రాజ్‌కమల్

ప్రజాశక్తి-వాల్మీకిపురం


సర్కిల్ పరిధిలో మద్యం అక్రమ రవాణాపై దృష్టి సారించాలని అడిషనల్ ఎస్‌పి వివి రాజ్‌కమల్ అన్నారు. సోమవారం ఆయన వాల్మీకిపురం సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బంది పనితీరుపై ఆరా తీసి, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, అసాంఘీక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. నాటుసారా తయారీ, విక్రయాలు, పేకాట, కోడిపందెం, నిషేదిత వస్తువులపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, లోన్‌యాప్‌ల వలన జరుగుతున్న మోసా లపై గ్రామాల్లో అవగాహనలు కల్పించి, చైతన్యపరచాలన్నారు. రాత్రి గస్తీ, వాహ నాల తనిఖీ ముమ్మరం చేయాలని సూచించారు. తదనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిం చకూడదని, ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచిం చారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్, సీటు బెల్టు ప్రాణాలను కాపాడుతాయని సూచించారు. రికార్డులు సైతం తమ వద్ద ఉంచుకొని వాహనాలను నడపాలన్నారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ బి.ఎన్ సురేష్, ఎస్ఐ బిందుమాధవి, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్‌పి వివి రాజ్ కమల్

రైతు శ్రేయస్సే సహకార సంఘాల ధ్యేయం

వీరబల్లి : రైతు శ్రేయస్సే సహకార సంఘాల ప్రధాన ధ్యేయమని ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, వీరనాగిరెడ్డి, సొసైటీ చైర్మన్ కల్లూరు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో సోమవారం 69వ సహకార వారోత్సవాలను పురస్కరించుకుని సొసైటీ చైర్మన్ కల్లూరి రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ, ఎరువులను విక్రయిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. రైతులు పెట్టుబడి కోసం ప్రయివేట్ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలు కాకుండా రుణాలు అందించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే సహకార సంఘాల ముఖ్య ఉద్దేశమని వివరించారు. నాటి సహకార సంఘాల స్ఫూర్తి నేటికీ కొనసాగుతున్నదని వెల్లడించారు. సొసైటీ పరిధిలోని రైతు లందరికీ సేవలు అందిస్తున్నామని చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. కార్యక్ర మంలో పెద్దవీడు సర్పంచ్ నాగిరెడ్డి, ఎంపిడిఒ మధుసూదన్‌రెడ్డి, సిఇఒ భూపాల్‌రెడ్డి, మురుగన్‌రాజు, కల్లూరిప్రతాప్‌రెడ్డి, వెంకటరామరెడ్డి పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

రైతులు సంఘంగా ఏర్పడితేనే వ్యవసాయానికి ఊతం

- జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు వలి

ప్రజాశక్తి-పీలేరు

రైతులందరూ సంఘటితమై ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడితేనే భవిష్యత్తులో ప్రభుత్వ సబ్సిడీలు, ప్రోత్సాహకాలు లభ్యమవుతాయని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బోదిషావలి పేర్కొన్నారు. మామిడిలో రైతు ఉత్పత్తి దారుల సంఘ ఆవశ్యకత-భవిష్యత్తు అవకాశాలు అన్న అంశంపై సోమవారం పీలేరులోని సిసిడి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పోకడలలో ఉత్పత్తిదారుల సంఘం ప్రధానమైనదని, ఒక గ్రామంలో లేదా పంట వేసే ఓ ప్రాంత రైతులందరినీ ఏకం చేసి ఉత్పత్తి దారుల సంఘం ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపోస్తున్నాయని వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వాలు రైతులకు వ్యక్తిగతంగా ఇస్తున్న సబ్సిడీలు ప్రోత్సాహకాలను ఇకపై ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడిన రైతులకే ఇచ్చే ఆలోచన కూడా చేస్తున్నాయన్నారు. వ్యవసాయ రంగంలోని ఊహించని పరిణామాలను రైతులు సమర్థవంతంగా ఎదుర్కోవడమే కాకుండా సామూహికంగా పంటలు వేస్తే సాగు పెట్టుబడి కూడా గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. పంట చేతికొచ్చిన తర్వాత కూడా రైతులందరూ ఏకమై తమకు కావలసిన ధర సంపాదించుకోవచ్చని, ఉత్పత్తిదారుల సంఘాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సబ్సిడీలు, పథకాలు వర్తింపజేస్తున్నాయన్నారు. రైతులందరూ ఈ విషయాలను అవగాహన చేసుకుని ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడాలన్నారు. అనంతరం ఉత్పత్తిదారుల సంఘాలకు కల్పిస్తున్న పథకాలు సంఘంగా ఏర్పడేందుకు పాటించవలసిన నియమ నిబంధనలను ఆయన వివరించారు. కార్యక్రమంలో పీలేరు హెచ్‌ఒ సుకుమార్, బాలాజీ, ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, సిసిడి పిఎం భాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రత్నశేఖర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు వలి

అంగన్వాడీ భవనానికి భూమిపూజ

రామాపురం: మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ కర్ణపు వాండ్ల పల్లెలో సోమవారం నాడు-నేడు కింద మంజూరైన అంగనవాడీ నూతన భవనానికి లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణతో కలిసి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం ప్రవేశపెట్టిన నాడు నేడు కార్యక్రమం ఓ బృహత్తర కార్య్ర కమన్నారు. నాడు నేడుతో విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, వైసిపి యువజన విభాగం కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంగన్వాడీటీచర్ కల్యాణి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు

కలికిరి : మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వార్డు మెంబర్లకు ఇఒ ఉదయ్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్డు మెంబర్లతో ఆయన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలికిరిరెడ్డివారిపల్లిలో వార్డు మెంబర్లు శ్రీనివాసులురెడ్డి, రాజేశ్వరి తమ వార్డు పరిధిలో రోడ్లు గుంతల మయం అయ్యాయని, నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, సంతకు వెళ్లే దారిలో సిసి రోడ్లు వేయాలని తెలిపారుర. ఇందిరమ్మ కాలనీలో వేంపల్లి ఖాదర్ బాషా వార్డ్ పరిధిలో డ్రైనేజీలు, నీటి పైపులైన్లు పనులు పెండింగ్లో ఉన్నాయని చెప్పారు. అనంతరం ఇఒ విజయ్ కుమార్ మాట్లాడుతూ కలికిరి మేనేజర్ పంచాయతీ పరిధిలో ఎలాంటి పనులు ఉన్నా ప్రతిపాదనలు పంపితే త్వరగా పనులు చేయడానికి ఆదేశాలు జారీ చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఈ నెల 11వ తేదీన కడపలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ లో రాష్ట్ర స్థాయి ఎంపికకు హెచ్ ఎంఎం హైస్కూల్ నుంచి అండర్-14 కబడ్డీ జూనియర్స్ జట్టుకు ఎస్.అనిల్, కె.బాలాజీ ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ కె.ఎం.దేవనందరం, ప్రధానోపాధ్యాయులు కెవి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని, రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో ఈ విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను కరెస్పాండెంట్, ప్రధానఉపాధ్యాయులతో పాటు పిఇటిలు పి.రాధారాణి, జి.కళ్యాణ్ వర్మలు, ఎం.వి.కృష్ణ విద్యార్థులను అభినందించారు. **నందలూరు:** త్వరలో జరగబోవు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని నలది మ్మాయి గారిపల్లె జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని సి.నందిని ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డయ్య తెలిపారు. ఆయన నందిని మెమెం టోతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కడప మున్సిపల్ స్టేడియంలో జరిగిన 14 ఏళ్ల లోపు బాలికల కబడ్డీ పోటీలలో నందిని విశేష ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైందన్నారు. జిల్లా జట్టులో రాణించేందుకు రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. విద్యార్థులు క్రీడల్లో విశేషంగా రాణించడానికి కృక్ష్మిషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రశాంతిని అభినందించారు.

సర్వే పక్కాగా నిర్వహించండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రజల జీవన ప్రమాణాలను గుర్తించి మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో ఈ నెల 18వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఇంటింటా నిర్వహించే సర్వే పక్కాగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి గిరిధర్ నాయక్ అన్నారు. సోమవారం సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను అంచనా వేసేందుకు వాలంటీర్లు ఇంటింటి సర్వే చేయాలన్నారు. 10 నుంచి 19 ఏళ్ల మధ్య కౌమార దశలో ఉన్న మహిళలు, బాలికలలో రక్తహీనత గుర్తింపు, గర్భిణులలో రక్తహీనత గుర్తింపు, ఐదేళ్లలోపు వయసు పిల్లల్లో తక్కువ బరువు ఉండే వారి శాతం గుర్తింపు వంటివాటిని సర్వే చేయాలని పేర్కొన్నారు. వాలంటీర్లు ఒక్కొక్కరు 50 నుంచి వివరాలు సేకరించి ఆ వివరాలను ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక ఆహ్వానితులు మల్లప్ప, శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పాత బస్టాండ్ కూడలిలో సోమవారం లయన్స్ క్లబ్‌ఆధ్వర్యంలో లయన్ పెనిగలపాటి చంద్ర సహకారంతో అన్న అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ పేదలకు సహాయం చేయడంలో ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రాజంపేట వారి ఆధ్వర్యంలో పరిసర ప్రాంత ప్రజలకు ఎప్పుడు ఏ ఇబ్బంది వచ్చినా సేవ చేయడానికి తాము ముందుంటామని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై.సుబ్రమణ్యం రాజు, కార్యదర్శి దండే రవికుమార్, రీజన్ చైర్మన్ అబ్బిరెడ్డి, మద్దిపట్ల రామకృష్ణమనాయుడు, వెంకటసుబ్బయ్య బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జాతీయ సాహస శిక్షణకు డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జాతీయ సాహస శిక్షణ శిబిరమునకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల యన్.యస్.యస్. కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐవల్.రాజమోహన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. యోగివేమన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల నుండి పదిమందిని ఎంపిక చేయగా వారిలో ప్రభుత్వ కళాశాల, రాజంపేట నుండి యన్.యస్.యస్ విద్యార్థులు సెకండ్ బి.యస్.సి. యం.పి.సి.యస్. నుండి అంజాద్, సెకండ్ బి.ఎ. నుండి వెంకట సుబ్బయ్య అను విద్యార్థులు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ క్యాంపు హిమాచల్ ప్రదేశ్ లోని సిమ్లా జిల్లాలో నవంబర్ 15 నుండి 24 తేదీవరకు సిమ్లాలోని హై ఆల్టిట్యూడ్ ట్రెక్కింగ్ అండ్ స్కైయింగ్ సెంటర్ అధ్వర్యంలో జరగనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుకు ఎంపికైన విద్యార్ధులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పురుషోత్తమ్ అభినందనలు తెలియజేశారు.

కొళాయి కనెక్షన్లకు అనుమతులు

ప్రజాశక్తి నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ నందు అక్రమ కులాయి కనెక్షన్లు కలిగిన గృహ యజమానులు వారి కొళాయి కనెక్షన్లకు డిపాజిట్ చెల్లించి క్రమబద్ధీకించుకోవాలని అలాగే అనుమతి లేకుండా నిర్మించిన గృహ యజమానులు వారి గృహములకు అనుమతులు పొందవలసిందిగా పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలియజేశారు. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీలోని గృహ యజమానులకు ఈనెల చివరి వరకు అవకాశం ఇస్తున్నామని, తదుపరి అనుమతులు పొందనిగృహ యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఇంటి పన్నులు, కులాయి ఫీజులు సకాలంలో చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు శూన్యం

ప్రజాశక్తి-ములకలచెరువు

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు శూన్యమని మండల జనసేన పార్టీ కన్వీనర్ పోతుల సాయినాథ్ అన్నారు. సోమవారం లే అవుటన్లను పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న పేదల సొంతింటి కలలు న్యాయం జరగలేదని తెలిపారు. గుట్టల్లో స్థలాలు ఇచ్చి ఆ స్థలాలను రెడీ చేసుకోవడానికి వాళ్లకు రూ.లక్షన్నరపై ఖర్చు అయినట్లు చెబుతున్నారన్నారు. పూర్తిగా ఇళ్లు కట్టుకోవడానికి రూ.10 లక్షల పైన అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నవరత్నాలలో భాగంగా పేదలకు కాలనీలు ప్రభుత్వమే పూర్తిగా ఇల్లు కట్టిస్తామని వైయస్సార్సీపి మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై పేద ప్రజలుకు అధికారులు అండగా నిలబడి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, కోటప్ప, వెంకటేష్, జగదీష్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



నందలూరు : విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎంపిపి మేడా

ప్రజాశక్తి-కలికిరి

నేటి బాలలే రేపటి పౌరులని జడ్‌పిటిసి పద్మజా లోకవర్ధన్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్, ఎంఇఒ రంగనాథ్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలోని 1 నుంచి 4వ వార్డులోని తేరువీధిలోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. చిన్నారులకు మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** విజన్ విత్ యు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలకు కొత్త బోయనపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యా కమిటీ చైర్మన్ బాలాజీ, పాఠశాల ఫౌండర్ బాల సుబ్బారాయుడు, ట్రస్ట్ ఉపాధ్యక్షులు స్నేహలత, కార్యదర్శి గణేష్, సంయుక్త కార్యదర్శి కార్తీక్, సభ్యులు లోకేష్, అశ్వత్, వినయ్, హాజీ, బాలాజీ, హేమంత్, ఉపాధ్యాయ పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల కేంద్రంలోని శ్రీ శివపార్వతి విద్యా సంస్థల్లో నెహ్రూ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ మనోజ్ కుమార్, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, ఉపసర్పంచ్ భోగి సారధి రత్నమ్మ, సిహెచ్ఒ రాజు, ఉపాధ్యాయులు హరిబాబు రేఖ చిత్ర నరసింహారావు పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. **మదనపల్లె అర్బన్:** భారతదేశ అభివృద్ధికి జవహర్ లాల్ నెహ్రూ ఎంతో కృషిచేశారని జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు హరిశర్మ అన్నారు. నెహ్రూ జయంతి సందర్భంగా స్థానిక రామారావు కాలనీ బాపూజీ హైస్కూలులో ఐద్వా, జెవివి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘు, ఉపాధ్యాయులు మురళి, హిమబిందు, ఐద్వా కార్యదర్శి భాగ్యమ్మ పాల్గొన్నారు. **వెలుగు ప్రత్యేక పాఠశాలలో...** బాలల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లీనాకుమారి, రాధమ్మ, సోషల్ వర్కర్ గీత, వెలుగు సిబ్బంది కళావతి పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. ఎపి మోడల్ స్కూల్లో వైస్ ప్రిన్సిపల్ రాజశేఖర్, కస్తూర్బా, జడ్పీ బాలుర, బాలికల, అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. **నందలూరు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెహ్రూ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం శివశంకర రెడ్డి, జెవివి నాయకులు ఎస్.రౌఫ్ బాష నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, సురేష్, లక్ష్మీ రాజ్యం బహుమతులు అందజేశారు. **తంబళ్లపల్లి:** మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ త్యాగరాజు, కస్తూర్బా బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ భారత, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పెద్దమండ్యం:** మండలంలోని అన్ని పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదర్శ, కస్తూర్బా, జడ్పీ పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. **నందలూరు:** నేటి బాలలే రేపటి పౌరులని వారి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి కోరారు. సోమవారం జ్యోతిబా పూలే బిసి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ మౌనిక ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు కలీం, వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి నడివీధి సుధాకర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :**నేటి బాలలే రేపటి నవసమాజ నిర్మాతలని వైఎస్ఆర్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భగా ఆయన చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. **రామాపురం :** మండలంలోని సరస్వతి పల్లె ఎంపిపి పాఠశాలతోపాటు పలు పాఠశాలలో బాలల దినో త్సవం నిర్వహించారు. ఎంఇఒ రామకృష్ణుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగభూషణ్ రెడ్డి, రమేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, కెనడి పాల్గున రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ విద్యార్థులు పాల్గొన్నారు. **రాయచోటి :** భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అని నెహ్రూ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అల్లా బకాష్ అన్నారు. సోమవారం జోహార్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి పిసిసి డెలిగేట్ ఎస్.ఎండి. గౌస్, రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ మహ్మద్ రఫీక్ , జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్న కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఖాదర్‌ఖాన్, తాలూకా మహిళా ప్రెసిడెంట్ రవణమ్మ, తాలూకా మైనార్టీ మహిళా ప్రెసిడెంట్ మహబూబ్ జాన్, యూత్ నాయకులు ఇమ్రాన్, ఇర్ఫాన్, వెంకీ, నాసర్ పాల్గొన్నారు. మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఐకె స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇషాక్‌అల్లిఖాన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఎంపిడిఒ దివ్య, ఎస్ఐ వీరాజంనేయుడు, శిశు సంక్షేమ శాఖాధికారి శారద, వసతి గృహ సంక్షేమాధికారి నూరుల్లాబాష బాలల దినోత్సవం సందేశాన్ని అందించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **గాలివీడు :** మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రయివేట్ పాఠశాలల్లో నెహ్రూ జయంతి సందర్భంగా చిన్నపిల్లల దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పిల్లలకు క్విజ్, ఆట, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రహదారి సమస్యకు పరిష్కారం



దారికి అడ్డుగా ఉన్న మట్టిని తొలగించడాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కొన్నేళ్లుగా నడక దారిని టిడిపి మాజీ సర్పంచ్ భర్త అడ్డగించిన ఘటన మండలంలోని అగ్రహారం పంచాయతీ మంచిగుంటపల్లిలో చోటు చేసుకుంది. మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషా, అధికార యంత్రాంగం చొరవతో సమస్య పరిష్కారమైంది. మండలంలోని అగ్రహారం పంచాయతీ మంచిగుంటపల్లె సర్వే నెంబర్లు 32/3, 32/5లో గ్రామానికి చెందిన టిడిపి మాజీ సర్పంచ్ జయరత్నమ్మ భర్త నరేంద్ర పొలంలో నుంచి దాదాపు 70 ఏళులగా ఊరి ప్రజలకు దారి వుంది. సుమారు 250 మీటర్ల పొడవుతో 35 సెంట్ల భూమి దారి వినియోగంలో ఉంది. ప్రభుత్వ నిధులతో పలుమార్లు ఈ రోడ్డును వేశారు. ఈనెల 10వ తేదీన నరేంద్ర, తన పొలంలో నుంచి గ్రామస్తులు ఎవరు వెళ్ళకూడదంటూ, జెసిబితో మట్టిని దారికి అడ్డంగా వేసి మూసేశారు. ప్రజలు నానా అవస్థలు పడ్డారు. సోమవారం గ్రామస్తులందరూ కలిసి ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్డీవో ఎంఎస్ మురళిని సంప్రదించి తమ సమస్యపై వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన వారు వెంటనే సమస్యను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆ మేరకు ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, తహశీల్దార్ సిఆర్ మంజుల, ఎంపిడిఒ లీలా మాధవి, సర్పంచ్ ఉషారాణి, సర్వేర్ షాన్వాజ్, పోలీసులతో కలిసి మంచుగుంటపల్లెకు వెళ్లారు. దారి సమస్యను పరిశీలించి వెంటనే జెసిబితో దారికి అడ్డుగా ఉన్న మట్టిని తొలగించి, రోడ్డు చదును చేయించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామస్తుల వినతి మేరకు దారికై 35 సెంట్లు స్థలం సబ్ డివిజన్ చేసి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. స్థానిక గ్రామ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. మరోసారి సమస్య పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవన్నారు. తమ గ్రామ దారి సమస్యను పరిష్కరించినందుకు స్థానిక ప్రజలు ఎమ్మెల్యే, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. దారి శాశ్వత పరిష్కారం కొరకు సిమెంట్ రోడ్డు మంజూరు చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సర్వేర్ షాన్వాజ్, సర్పంచ్ ఉషారాణి, ఉప సర్పంచ్ భాస్కర, వైసిపి నాయకులు కైలాసపతి, రామారావు, ఆర్టీసీ శ్రీనివాసులు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్ఆర్‌పై అట్రాసిటీ కేసు హేయం : టిడిపి

ప్రజాశక్తి-రామాపురం

రాయచోటి టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టడం హేయనీయమని టిడిపి మండల నాయకులు గడికోట విజయ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి హయాం నుంచి దళితుల పట్ల ఆప్యాయత అనురాగాలతో ఆర్ఆర్ కుటుంబం మెలుగుతోందన్నారు. **రాయచోటి :** లక్కిరెడ్డిపల్లి మండలం మద్దిరేవుల గ్రామం కొత్త మాది పల్లెలో దళిత కుటుంబాల మధ్య నెలకొన్న భూ వివాద సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలంటూ సర్ది చెప్పేందుకు వెళ్లిన రమేష్ కుమార్ రెడ్డిపై వైసిపి నేతల ప్రోత్బలంతో పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును అక్రమంగా బనాయించడం అన్యాయమని టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, అక్రమాలు అధికమయ్యాయని తెలిపారు. **అక్రమ కేసులు ఎత్తి వేయాలని కలెక్టర్‌కు వినతి** ఆర్.రమేష్ కుమార్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తి వేయాలని దళిత నాయకులు, మాజీ సర్పంచులు రెడ్డన్న, చెంద్రాయుడు, ఎంపిటిసి మోటుపల్లి రాధమ్మ, వట్టికాళ్ళ వెంకటరమణ, వట్టికాళ్ళ నాగయ్య, మోటుపల్లి రెడ్డేశేఖర్, లక్ష్మమ్మ కలెక్టర్ గిరీషా, ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. **లక్కిరెడ్డిపల్లి:** రమేష్ కుమార్ రెడ్డి 2024 ఎన్నికల్లో రాయచోటి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తాడని రాజంపేట పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు టోపిరెడ్డి నవీన్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు రమేష్ కుమార్ రెడ్డి ప్రజల్లో వస్తున్న సానుభూతులు ఓర్వలేక అక్రమ కేసులు పెట్టడం ఖండిస్తున్నామన్నారు. **రాయచోటి :** తెలుగుదేశం నాయకులపై అక్రమ కేసులు బనాయించడం రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో తనపైనా 307 కేసు నమోదు చేశారని, ప్రస్తుతం రమేశ్ కుమార్ రెడ్డిపై కూడా అక్రమ కేసులు బనాయించారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు


కేసుతో సంబంధం లేదు : ఎంపిపి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి కేసులకు తమకు ఎలాంటి సంబంధం లేదని ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు సోమవారం ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల భూములు మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి భూములు పక్క పక్కల ఉన్నాయి వారిద్దరి వారి ఇరువురు మధ్య ఏమి జరిగిందో మాకు తెలియదన్నారు. శివ నారాయణ తన భూమి తన కుటుంబ సభ్యులు వద్దకు వెళ్లి గట్లు జరుపుతున్నారని ఉద్దేశంతో రమేష్ కుమార్ రెడ్డి శివనారాయణ మాట్లాడుకున్న విషయంపై దళితుడైన శివ నారాయణకు తన భూములలో ఆక్రమించుకొని అక్రమంగా గట్లు వేస్తున్నారన్న ఉద్దేశంతోనే రమేష్ రెడ్డిని ప్రశ్నిస్తే తన అనుచరులు తిట్టడం కొట్టడం జరిగిందని శివ నారాయణ రమేష్‌రెడ్డి ఆయన అనుచరులపై కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో తమకు ఎలాంటి సంబంధం లేకుండా సుదర్శన్ రెడ్డి యువతను చెడగొడుతున్నాడని, అక్రమాలకు పాల్పడుతున్నాడని అనడం చాలా దుర్మార్గమైన చర్యని ఖండించారు. చిల్లర రాజకీయం తాము చేయడం లేదని తెలిపారు. టిడిపి హయాంలో శ్రీకాంత్‌రెడ్డి ఎమ్మెల్యే అవుతున్నాడని, లక్కిరెడ్డిపల్లి మండలం ఎంపిపి, జడ్పిటిసి, స్థానాలు ప్రజలు మాకు పట్టం కట్టారని, తాము ప్రజలతో మమేకమై ప్రజల్లో మంచి పేరు ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డయ్య కో-ఆప్స్ నెంబర్ సయ్యద్ అమీర్, మార్కెట్ వైస్ చైర్మన్ షాజహాన్, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు

బిటి కళాశాల కరస్పాండెంట్‌కు సన్మానం

మదనపల్లె అర్బన్: స్థానిక బిటి కళాశాల కరస్పాండెంట్ రిటైర్డ్ లెక్చలర్ మునిరత్నంను సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక జిఆర్‌టి హైస్కూల్‌లో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనిట్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ, కార్యదర్శి విఎం నాగరాజు, ట్రెజరర్ ఉస్మాన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మునిరత్నంను అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన గౌరవ అధ్యక్షులు మునిరత్నం మాట్లాడుతూ తన నమ్మకంతో తనను ఎన్నుకున్న అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ సిటిజన్స్ పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో జగన్మోహన్, అంకిరెడ్డి, రమణ, ప్రసాద్, కరుణాకర్, రామచంద్ర ధనలక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.



మునిరత్నంను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్



పీలేరు : మాట్లాడుతున్న జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - బి కొత్తకోట

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ అధికారి తులసి నాయక్ పేర్కొన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి హాజరై పతాకవిష్కరణ చేశారు. **కలకడ:** స్థానిక శాఖ గ్రంథాలయంలో ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆయేషా పాల్గొని వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి, వైసిపి నాయకులు షావత్ అలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లె :**గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు పఠన ఆసక్తి పెంపొందించుకోవాలని జాంద్రపల్లి ప్రధానోపాధ్యాయులు త్రివేణి పేర్కొన్నారు. జాంద్రపల్లిలో బాలల దినోత్సవం పురస్కరించుకొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహులు, వెంకటేశ్వర్లు, నాగులయ్య, వెంకటాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:**గ్రంథాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఫోర్డ్ సంస్థ ప్రతినిధి నరసింహులు, పాఠకులు పాల్గొన్నారు. **పీలేరు:** స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి విజయకుమార్, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ, వైఎస్సార్‌టియూసిజిల్లా అధ్యక్షులు చిన్న ఎల్లప్ప, తెలుగు అధ్యాపకులు భాస్కర్, ఆంజినేయులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది ఫాతిమ, సచివాలయ సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. **గాలివీడు:** గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక లైబ్రరీలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. లైబ్రేరియన్ రామచంద్రనాయక్ పిల్లలకు మిఠాయిలను పంచిపెట్టారు.

చెన్నకేశవరెడ్డికి మాతృ వియోగం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని సి.పొలిమేరపల్లెకు చెందిన టిడిపి నాయకులు చెన్న కృష్ణారెడ్డి తల్లి మృతి చెందారు. సోమవారం రాయచోటి నియోజకవర్గం నేత మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టిటిడి మాజీ పాలక మండలి సభ్యులు సుగువాసి ప్రసాద్‌బాబు ఆమె మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-గాలివీడు

కుష్టు వ్యాధి నిర్మూలనకు అధికారులతో పాటు ప్రజలు కృషి చేయాలని మండల వైద్యాధికారులు డాక్టర్ రాధా మాధవి, డాక్టర్ పి.రఫిక్ పిలుపునిచ్చారు. జాతీయ కుష్టు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సోమవారం గాలివీడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో మండల వైద్యాధికారులు సమావేశం నిర్వహించి కుష్టు వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సాధారణ చర్మపు రంగు కంటే కొంత తక్కువ రంగు లేదా రాగి రంగు ఉండి పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ స్పర్శ కోల్పోయిన మచ్చలు ఉన్నా, కనురెప్పలు, వెంట్రుకలు ఊడిపోవడం కుష్టు వ్యాధి లక్షణాలు అని సూచించారు. ఈనెల 15 నుంచి డిసెంబర్ 5 వరకు గ్రామాలలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలు సర్వే నిర్వహించి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఎఎన్ఎంలకు సమాచారం అందివ్వాలని సూచించారు. ప్రస్తుతం ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో కుష్టు వ్యాధికి ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలలో పకడ్బందీగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సుబ్బలక్ష్మి దేవి, ఎం పిహెచ్ ఇఒ శ్రీనివాసులురెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు కె.మహేశ్వర్‌రెడ్డి, రామతులసి, ఎఎన్ఎంలు సునీత, సుజాత, జ్యోతి, అయ్యావారమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు కృష్ణవేణి, యాసీన్, నయాజ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

తంబళ్లపల్లి: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక జరుగుతుందని ఎంపిడిఒ ఆనంద్ కుమార్, ఎపిఒ మాధవి, ఎస్ఆర్‌పి సూర్యచక్రం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండలంలో 2020 ఏప్రిల్ నెల నుండి 2022 మార్చి నెల వరకు ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు.

క్రైం కార్నర్



నిందితులు, దుంగలను చూపుతున్న అటవీ అధికారులు

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- ఏడు దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గువ్వలచెరువు తూర్పు బీట్‌లో ఏడు ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు రాయచోటి ఫారెస్ట్ డిఆర్ఒ రవిశంకర్ తెలిపారు. మండల పరిధిలోని పాలకొండలో గువ్వల చెరువు తూర్పు బీట్‌లో కర కట్టవా వద్ద ఏడు ఎర్రచందనం దుంగలను ముగ్గురు స్మగ్లర్లు తెలుస్తుండగా డిఆర్ఒ ఇన్‌ఛార్జి రేంజ్ రఘుశంకర్ ఆధ్వర్యంలో దాడి దాడి చేశారని చెప్పారు. స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని విచారించామని చెప్పారు. అరెస్టయిన వారిలో తమిళనాడుకు చెందిన శంకర్, పరమశివం , రామన్ పొన్ను స్వామి ఉన్నారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి ఏడు దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఫారెస్ట్ అధికారులు రెడ్డప్ప మహబాషా గాయత్రి హర్షవర్ధన్‌రెడ్డి, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీ : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-కలికిరి

రెండు వాహనాల ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన కలికిరి క్రాస్ రోడ్డు మార్కెట్ యార్డు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన శామీర్‌కు చెందిన బొలెరో వాహనం పీలేరు వైపు వెళుతుండగా అదుపు తప్పి తిరుపతి నుండి ఎదురుగా వస్తున్న కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా చందనూరుకు చెందిన వెంకటేష్ షిఫ్ట్ వాహనాన్ని వాహనం వేగంగా ఢీకొట్టడంతో కారు ముందర భాగం ధ్వంసమైంది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులతో పాటు బోలోరో డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ లోకేష్‌రెడ్డి తన సిబ్బందితో చేరుకుని వాహనాలను క్రైన్ సహాయంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.